

# టేకిట్ ఈజీ!! - 2

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



# ఆనాటి సంత హేల

ఆదివారము నాడు అరటి మొలిచిందో లేదో తెలియదు గానీ, ఆ రోజు వస్తోందంటేనే భయం వేసేది, పాతికేళ్ళక్రితం. ప్రతి ఆదివారం నాన్నా, అన్నా మండీ కెళ్ళేవారు. అదిగో, ఆ కిచకిచలే వద్దన్నాను. మీ బోడి సినిమా పరిజ్ఞానం అఘోరించినట్టే వుంది, మండీ అంటే, ఆ ***"మండీ"*** కాదు. సబ్జీ మండీ, అంటే, కూరల సంతన్నమాట. అంటే, మా సికింద్రాబాదు మోండా మార్కెట్టన్నమాట. వారం పొడుగూతా కుప్ప నూర్పులకి కావాలిగదా, అవన్నీ ఆదివారం కొనుక్కుని, అట్టే పెట్టుకునేవాళ్ళం. వారవంతా పులిలా తినేవాళ్ళం. అంతవరకూ బాగానే వుండేది సంబడం. అయితే, అన్నకి ఒక్కోసారి పెసల్ క్లాసులూ గట్రా వుండుటచేతా, లేదా నూటనాలుగు జెరము తగులుట చేతా, ఏతా వాతా ఆ పని మనకి తగులుకునేది. అప్పుడు ఛచ్చేది గొట్టె. మీకేం, ఎంచక్కా కాలుమీద కాలేసుకుని, ముక్కులో వేళ్ళెట్టేసుకుని, ఇప్పుడు కథలా చదివేస్తారు గానీ, ఆకాలంలో నా పాట్లు పగవాడికి కూడా వద్దనిపించేది. *మా నాన్నగారితో మోండా మార్కెట్టుకెళ్ళడవంటే, పరిగెత్తే గాంధీగారితో దండి యాత్రకెళ్ళినట్టూ, దండయాత్ర కెళ్ళే అలెజ్జాండరు గుర్రం పక్కనే బల్లెం చేతిలో పట్టుకుని పరిగెత్తినట్టూ, కాలి నడకన కాశీ యాత్ర కెళ్ళినట్టూను.* మీరిప్పుడు నమ్మరు, ఎదర చదవండి, తెలుస్తుంది.

ఏవిటో అప్పుడిదాకా చల్లగానే వుండేది. నాన్న షేవింగూ, అందరి స్నానాలూ, దేవుడికి అగరొత్తులూ అయ్యేసరికి తొమ్మిదైపోయేది, ఎండ మొదలైపోయేది.

***"ఈ శీనిగాడితో ముహూర్తం ఇల్లాగే ఉంటుంది, పదరా బాబూ, అందరూ ఈ పాటికి ఏరేస్తారు, మనకి పుచ్చులే మిగులుతాయి ఇవ్వాళ"*** అంటూ బయల్దేరేవాళ్ళు నాన్న.

అయినా నాకు అర్థం కాదు గానీ, మొత్తం దిక్కుమాలిన జెంట నగరాలన్నీ ఆదివారవే కొనేసుకోవాలా కూరలు? అదీ, మేము వెళ్ళే మోండా మార్కెట్లోనే కొనాలా? జాతకం, ఎవర్నని ఏం లాభం? సరే, నాన్న వెనకాల నేను

జనపనార సంచీలు, సంచీలో సంచీలూ స్టైలుగా ఊపుకుంటూ, బస్టాపుదాకా నడిచేవాణ్ణి. మధ్యలో అక్కడక్కడా మా కోలనీలో బిరియానీ మసాలాలు నూరిన వాసన ఉక్కిరిబిక్కిరి చేసేసేది. నాకా అదృష్టం లేదుగదా, ఇంకా వెళ్ళాలి, కొనాలి, మొయ్యాలి, రావాలి, తేవాలి, అప్పుడు, పెట్టింది తినాలి, ఇంత తతంగం ఉందిరా భగవంతుడా, అని నిట్టూరుస్తూ, శంకరమఠం స్టాపులో బస్సెక్కి, ఓ గెంటకి సికింద్రాబాదు చేరేవాణ్ణి నాన్నగారితో సహా.

అప్పటికే పదిదాటేది. నెత్తిన ఎండ చుర్రుమనిపించేది. ఒఖ్ఖసారి కూరగాయల వాసనలు, తడిసిన గోనె సంచుల వాసనలూ, పసుప్పు, కుంఖం, కారం, ఎండుమిరపకాయలు, ఇల్లా ఒహటేవిటి, నానా రకాల వాసనలతో గుబాళిస్తూ మమ్మల్ని *"సారొత్తారొత్తారా"* అని పిలిచేది మోండా మార్కెట్టు. అప్పుడు నాన్న గారి ఫేసు చూస్తే,అజ్ఞాతం తీరిపోయిన అర్జునుడిలా, ఫైటింగుకి రెడీగా వున్న నర్తనశాలలో ఎన్.టీ.యార్ లా ఉండేది. ఎదర అమ్ముకునేవాళ్ళంతా కౌరవుల్లా అనిపించేవారు. నేను కంటికి నదురుగా కనిపించిన చోట ఆగేవాణ్ణి (నేనంటున్నది అమ్మేవాళ్ళ గురించి కాదు, కూరల గురించి). వెంటనే నాన్న వెనక్కి తిరిగి చూసేవారు.

***"ఇక్కడ టమోటాలు బావున్నాయి చూడండి"*** అనే వాణ్ణి.

వెంటనే ఆయన విసుగ్గా మొహం పెట్టి,

***"అబ్బే, నా మొఖం, ఎర్రగా ఉంటే బావున్నట్టేనా, రంగేహేత్తారు, పచ్చివి పట్టుకొచ్చి, గొడౌన్లో పోహేసి, గేసు పెట్టేసి, ముగ్గెట్టేత్తారు, రంగు రాడానికి నీలాంటి వెఱ్ఱిపీనుగులు మీదపడి కొనేసుకుంటారు, నా దగ్గర కాదు ఈ మేజిక్కులు, ఆ ఎదర మనవాడున్నాడు, ఫస్ట్‌క్లాస్ టమోటాలు, చక్కగా చిన్న చిన్నవి, చూపిస్తా పద..."*** అంటూ లాక్కుపోయేవారు ఎదరకి.

ఎఱ్ఱ రంగు టమోటాల వెనుక ఇంత టెర్రరిస్టు కుట్ర ఉందని నాకప్పుడే తెలిసింది. ఆ టమోటాలమ్మి నాకేసి ఓ సారి జాలిగా చూసి, కళ్ళొత్తుకునేది. నేను బేలగా ఓ లుక్కిచ్చి, ఈసురోమని నాన్నగారిని ఫాలో అయిపోయేవాణ్ణి. అలా నాలుగు సందులు దాటి ఆ *"మనవాడి"* దెగ్గిరకెళ్ళేవాళ్ళం. వాడు నాన్నగారిని చూడగానే, తీహార్ జైల్లో ఖైదీ తనని చూడడానికి ఎవరన్నా వస్తే, వస్తూ వస్తూ కారప్పూస పట్టుకొస్తే, ఎంత సంబరపడతాడో, అంతకన్నా ఎక్కువగా సంబరపడేవాడు.

***"రండయ్యా, కేజి మీద చారాణా తగ్గిస్తా, జూసుకోండి,"*** అని చిన్న చిన్న టమోటాలు పోసేవాడు సంచీలోంచి. ఆ టమోటాలని చూస్తే గుండె తరుక్కుపోయేది. అసలు అవన్నీ ఒక రాష్ట్రంలో పండినవి కావేమోనని అనుమానం వేసేది. కొన్ని కోలగా, కొన్ని సొట్టగా, కొన్ని త్రిభుజాకారంలోను, ఇంకొన్ని దీర్ఘ చతురస్రాకారంలోను గోచరిస్తూ,

అనాథాశ్రమంలో పిల్లల్లా బేలగా చూస్తూ ఉండేవి. అసలు అలాంటి కలెక్షను మెయింటెయిన్ చేస్తున్నందుకు ఆ కొట్టు వాడికి కోట్లిచ్చినా తక్కువే. నాన్న గారు వాటిల్లోంచి ఓపికగా ఏరి, ఓ నాలుగు కిలోలు పట్టించేవారు.

అదిగో, అక్కణ్ణించీ మోత మొదలు. పాపం, మొదటంతా నాన్నగారే మోసేవారు. ఎదర కెళ్ళేకొద్దీ నా వంతు వచ్చేది. బంగాళదుంపలు కొనడం, తినడం బానే వుంటుంది, గానీ, మొయ్యడవే ?! దాని దుంప తెగ, చేతులు పడిపోయేవి. అందుకే అవి ఆఖర్లో కొనేవాళ్ళం. ముందర ఆకు కూరలు, అల్లం పచ్చి మిర్చీ, వెల్లుల్లీ, చిన్న కాబేజీ పూలూ, కాలీఫ్లవర్ పూలూ గట్రా కొనేసి, ఆఖర్లో ఆలుగడ్డలన్నమాట. బెండకాయలు గిల్లితే గానీ కొనేవారుకారు నాన్న. వాడేమో గిల్లనిచ్చేవాడు కాదు. అందుకని నేను వాడితో సోది ముచ్చట్లేవో పెట్టి వాడి బుఱ్ఱ నంచుకునేవాణ్ణి. ఒకసారి *కుక్క గొడుగుల పెంపకం గురించి, ఇంకోసారి కోళ్ళలో కండ్లకలక నివారణ గురించి, మరోసారి సుబాబుల్ మొక్కల పెంపకం, కృష్ణజింకల సంరక్షణ గురించి,* ఇలా టీవీలో వచ్చే నానా చెత్తా వాడికి సోదాహరణంగా వివరించేవాణ్ణి. అదను చూసి నాన్నగారు గబ గబా బెండకాయలు గిల్లేసి, ఏరేసి, తూకం వేయించేసేవారు. కేబేజీ పువ్వుకి, పైన నలిగిపోయిన ఒక్కో ఆకు తీసేస్తూ పోతే, చివరికి లోపల ఏ రెండు ఆకులో మిగిలేవి. అవి జాగ్రత్తగా పట్టుకుని, తూకం వేయించేవాణ్ణి. కొట్టువాడు నన్ను కళ్ళతోనే నమిలి మింగేసేవాడు. నాన్న మాత్రం ***"లే.త కాబేజీ"*** అని ముచ్చటపడిపోతూ, సంచీలో వేసేవారు.

అదేవిటోగానీ, నాన్నగారు ఆకుకూరల అవ్వల దగ్గర మాత్రం అస్సలు బేరం ఆడేవారు కాదు. వాళ్ళు చెప్పిన ధర ఇచ్చేసి, కావలసిన కట్టలు ఓ పదో, పన్నెండో తీసుకునేవారు. అప్పటికే సంచీ హేండిల్సు చేతులని కరవడం మొదలెట్టేవి. ఆలుగెడ్డల దగ్గిరికి వచ్చేసరికి నావి రెండి, నాన్న గారివి రెండు, మొత్తం నాలుగు పెద్ద సంచీలు నిండిపోయి, కుట్లు తెగిపోడానికి సిద్ధంగా వుండేవి. ఆ ఆలుగెడ్డలమ్మేవాడికి ఓ కూతురుండేది. ఇంచుమించు నా వయసే ఉండేది. మొత్తం బంగాళదుంపలన్నీ సంచీలో పోయిస్తూంటే, అది నన్ను చూసి ఓ మాటు నవ్వేది. అంతే, నాకు అలసట అంతా తీరిపోయి, మళ్ళీ వెయ్యి బంగాళదుంపల బలం వచ్చేసేది. వెంటనే సంచీలు మోసుకుంటూ, జాగ్రత్తగా బేలన్సు చేసుకుంటూ నడుచుకుంటూ, సంతలో తిరిగే ఆంబోతుల్ని తప్పించుకుంటూ, బస్టాపుకొచ్చేవాళ్ళం. మా పుణ్యం పుచ్చి అప్పుడే బస్సు బయల్దేరడానికి సిద్ధంగా వుండేది. దాన్లోకి దూకేసి, సంచీలు సద్దేసి, కిటికీ సీటు, ఆ పక్క సీటు కొట్టేసి, ఊపిరి పీల్చుకునేవాళ్ళం.

బస్సు బయల్దేరాకా నాన్న అనేవారు ***" నీకు లౌక్యం తెలీదురా, మనకి నచ్చింది కదా అని, ప్రతీ చోటా ఊ...వేళ్ళాడి పోకూడదు. అప్పుడు వాడు చెట్టెక్కేస్తాడు. అందుకే, మనకి ఎంత నచ్చినా, విసుగ్గా మొహం పెట్టి, అవతలివీ, ఇవతలివీ చూస్తూ, ఇష్టంలేనట్టుగా బేరం ఆడాలి. వాడు చెప్పిన రేటుకి సహం రేటుతో మొదలెట్టాలి బేరం. ఇవన్నీ ఇంకా***

***ఎప్పుడు తెలుసుకుంటావు? డబ్బులేని వాణ్ణి ఈ లోకం గడ్డి పోచకన్నా హీనంగా జమకట్టేస్తుంది. అందుకే, సంపాదించడం ఒక ఎత్తు, దాన్ని ఒబ్బిడి చేసుకోవడం ఇంకో ఎత్తూను."*** అనే వారు నాన్న.

***"మరి ఆకు కూరల అవ్వ దగ్గిర ఎందుకు బేరం ఆడలేదు?"*** అడిగేవాణ్ణి అమాయకంగా.

***"అదా, అది మానవత్వం రా. ఆ ఆకు కూరల అవ్వకి మహా అయితే కట్టకి ఏ పది పైసలో మిగులుతుంది. అక్కడ బేరవాడి దాని పొట్ట కొట్టకూడదు. పిడుక్కీ, బియ్యానికీ ఒకటే మంత్రం పనిచెయ్యదు."*** అనేవారు నవ్వుతూ. ఓ సారి నాన్న కొలీగు తగిలారు బస్సులో. నా కాళ్ళదెగ్గిర కూరల సంచీలు, దివాలా తీసినట్టున్న నా మొహం చూసి,

***"ఏరా, టెంతు పరీక్ష డెక్కేసిందా? సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంటా?"*** అన్నారు పళ్ళికిలిస్తూ.

నాకు ఛఛ్చే నీరసంగా ఉండి, ఓ మాటు కళ్ళు బరువుగా పైకెత్తి, ***" ఈ కూరలు అమ్మడానికి కాదండీ, తినడానికి"*** అన్నాను నిర్లిప్తంగా. ఆయన ఒఖ్ఖమారు జడుసుకుని, రన్నింగులో బస్సులోంచి దూకేసి, జన జీవన స్రవంతిలో కలిసిపోయారు.

ఇంతలో మా స్టాపొచ్చేది. మెల్లిగా దిగి, ఈసురోమంటూ ఇంటికొచ్చి, కాళ్ళూ చేతులూ కడిగి, భోజనం చేసి, పడుకునేవాళ్ళం.

***" హమ్మయ్య, ఇంక మళ్ళీ ఆదివారందాకా భయం లేదు, అయినా వచ్చేవారం నించీ అన్న వెడతాడుగా, మనం క్రికెట్టాడేసుకోవచ్చు. "*** అనుకుంటూ, మండీలో కనిపించిన పాత్రలనీ, అనుభవాలనీ, నాన్నగారు చెప్పిన పాఠాలనీ నెమరువేసుకుంటూ కునుకు తీసేవాణ్ణి.

## (వచ్చే సంచిక దాకా లైట్ తీస్కోండి!)

POST YOUR COMMENTS